37)రామక్రియ

ప॥ అటుచూడు సతినేర్పు లవుభళేశ। అటుమటములు గావు అవుభళేశ॥

చ॥ యెదురు గొండల మీద నెక్కినట్టి లకిమమ్మ। అదివో నీ తొడ యెక్కెనౌభళేశ।
వుదుటున నంతలోనే వురముపై నెలకొని। అదిమీ జన్ములనిన్ను నౌభళేశ॥

చ॥ ముంగోపముతోడను మొక్కలీడవైన నిన్ను। నంగన గద్దెపై బెట్టె నౌభళేశ।
కంగక వేదాద్రి నిన్ను గరుడాద్రికి దీసె। అంగా లంటె నింటిలోన నౌభళేశ॥

చ॥ చేరి నీవు నవ నారసింహరూపులైతే జెలి। ఆ రీతుల నిన్ను గూడె నౌభళేశ।
గారవాన నీవు శ్రీవేంకటముపై నుండగాను। అరసి రతి మెప్పించె నౌభళేశ॥